www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 25 అక్టోబర్ 2024
5
అన్నమయ్య



హాకీ పోటీల్లో 'జ్ఞానాంబిక' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి

అంతర్ యూనివర్సిటీ హాకీ, బ్యాడ్మింటన్ పోటీల్లో మదనపల్లి జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కరెస్పాండెంట్ డాక్టర్ గురుప్రసాద్ తెలిపారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన అంతర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొన్న తమ డిగ్రీ కళాశాల హాకీ టోర్నమెంట్‌లో ఫైనల్ చేరి రన్నర్స్‌గా నిలిచారన్నారు. సెటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కూడా రన్నర్స్‌గా నిలిచి షీల్డ్ అందుకున్నారని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, పీడీ శరత్ నాయక్ అభినందించారు. ఉన్నత విద్య బోధనతో పాటు క్రీడల్లో పాటు తమ విద్యార్థులు రాణిస్తున్నారని పేర్కొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న గురుప్రసాద్

విధుల్లో నిర్లక్ష్యం చూపొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లి

విధుల నిర్వహణలో చిత్తశుద్ధితో నాణ్యతగా పనిచేసి రెవెన్యూ శాఖ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం మదనపల్లిలోని టిటిడి కల్యాణ మండపంలో సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆధ్వర్యంలో డివిజన్ తహశీల్దార్లు, డిటిలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు వీఆర్ఓ, వీఆర్ఎలతో రెవెన్యూ అంశాలపై డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం ఉన్న వ్యవస్థ రెవెన్యూ శాఖ ఒక జవాబు దారి తనంతో మనమందరం పనిచేయాలి పనితీరు మెరుగుపర చుకోవాలన్నారు. మానవతా దృక్పథంతో వ్యవహరించాలి ప్రజలతో మమేకమై సఖ్యతగా మెలగాలి, మార్గదర్శకాలను పాటిస్తూ చట్ట ప్రకారం పని చేయాలని సూచించారు. ప్రజల వద్ద మంచి పేరు సంపాదించుకోవాలి. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లగలిగినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుందని ఉద్బోధించారు. ఏలాంటి సమస్యనైనా కాలాతీతం చేయకుండా వేగంగా స్పందించి చట్టప్రకారం చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించడమే మన ధ్యేయం కావాలని ఆ దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఏపీ జూన్ నుంచి అక్టోబర్ 15 వరకు పిజిఆర్ఎస్ ద్వారా అందిన 1624 దరఖాస్తుల్లో 1120 పరిష్కరించారని, 464గడువులోపల ఉన్నట్లు పేర్కొన్నారు. 40 దరఖాస్తులు రీఓపెన్ చేశామన్నారు. 18 పరిష్కరించగా ఇంకను 22 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దరఖాస్తులను తూతూ మంత్రంగా నామ మాత్రంగా కాకుండా నాణ్యతగా పరిష్కరించడమే ధ్యేయం కావాలన్నారు. పిఆర్ఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తుల్లో మొత్తం దరఖాస్తులు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, ఎస్ఎల్ఏ పరిధిలో ఉన్న దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. భూ సమస్యలపై అధికంగా వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎస్ఎల్ఏ పరిధి దాటకుండా వాటిని పరిష్కరించాలని సూచించారు. ఆయా మండలాలలో జరుగుతున్న ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ పరిశీలన ప్రగతిపై కూడా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. డివిజన్ పరిధిలోని 153 రెవెన్యూ గ్రామాలలో 19764 సర్వే నెంబర్లలో ఫ్రీహోల్డ్ అసైన్డ్ భూముల పరిశీలన చేశామన్నారు. 243 హైకోర్టు కేసులకు గాను 150 కేసులలో కౌంటర్ దాఖలు చేశారని ఇంకనూ 93 పెండింగ్లో ఉన్నాయన్నారు. హైకోర్టు కేసులు, లోకాయుక్త మరియు జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొని నిర్ణీత వ్యవధిలో కౌంటర్లు ఫైల్ చేయాలని తెలిపారు. 15 రోజుల్లోగా మిగిలిన వాటికి కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. అలాగే 38 కంటెంప్ట్ కేసులలో 27 కౌంటర్లు వేశారని మిగిలిన వాటికి వెంటనే కౌంటర్లు ఫైల్ చేయాలని తెలిపారు. ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత కాలపరిమితిలోగా అన్ని కేసులకు కౌంటర్లు సబ్మిట్ చేయాలని సూచించారు. నాలా కేసులను, డివిజన్ పరిధిలో భూ అలీనేషన్ పనులు భూసేకరణ, అలియనేషన్ అంశాలను సమీక్షించి తగు సూచనలు చేశారు. మదనపల్లి మున్సిపాలిటీలో మురుగునీటి శుద్ధి కార్యక్రమం నిమిత్తం భూ సేకరణ అంశంలో అడ్డంకులు తొలగించుకుని వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల సివిల్ రైట్స్ డే తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. మండల సర్వేయర్లు ప్రైవేట్ భూముల్లో సర్వే కొరకు ఏదైనా దరఖాస్తు రాగానే సంబంధితులతో ఆఫ్ లైన్ దరఖాస్తు ఫీజు చెల్లించిన పిదప నిర్ణీత కాలంలోగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. బదిలీ అయిన వీఆర్ఓలను వెంటనే రిలీవ్ చేయాలని తహశీల్దారులకు సూచించారు. బదిలీ అయిన ప్రదేశంలో వీఆర్ఓలు విధుల్లో చేరాలి. విధుల్లో చేరని వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఆయా అంశాల్లో తహశీల్దార్లు తమ పరిధిలో సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని తెలిపారు. వారి పరిధిలో లేని అంశాలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. రెవెన్యూ అంశాలలో లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, సర్వే శాఖ జిల్లా అధికారి భరత్ కుమార్, తహశీల్దార్లు, డిటిలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, విఆర్ఒ, విఆర్ఎలు, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

'సూపర్ సిక్స్'పై శ్రద్ధ పెట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలుపై శ్రద్ధ పెట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి ఫాసిస్ట్ విధానాలకు జగన్, నేడు చంద్రబాబునాయుడు బానిసగా ఉన్నారని విమర్శించారు. సొంతప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బిజెపికి తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను గాలికొదిలేశారన్నారు. మరోవైపు పవన్ కళ్యాణ్ తన నటనాచాతుర్యంతో తిరోగమన విధానాలైన ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, విహెచ్‌పి లను ప్రోత్సహిస్తూ సనాతన ధర్మం పేరుతో రాష్ట్రంలో మత కుల వ్యవస్థను నిర్మాణం చేస్తున్నారని వాపోయారు. టిడిపి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కాలం గడుపుతోందని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ కరెంట్ భారాలతో నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. విపరీత వర్షాలు, కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, కార్మిక ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలను సమీకరించి పాలకుల వైఖర్యాలను ఎండగట్టి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి సిపిఎం సిద్ధమైందని పేర్కొన్నారు. ఈ నెల 26, 27వ తేదీలలో రాయచోటిలో నిర్వహించబోయే సిపిఎం జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 27వ తేదీ ఉదయం 10 గంటలకు ర్యాలీ, 11 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలో జిల్లా సమగ్రాభివృద్ధి కార్యాచరణ రూప కల్పన చేస్తున్నామని వెల్లడించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు హాజరువుతున్నారని తెలిపారు. ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు మహాసభల జయప్రదానికి ఆర్థిక హార్థిక సహాయం చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.మాధవయ్య, ఎస్.రామచంద్ర, బి.రెడ్డెయ్య, బి.మోహన్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రాయచోటిలో జరిగే సిపిఎం జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ళ మణి కోరారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని కార్మిక, రైతాంగ సమస్యలు, గ్రామీణ ఉపాధి హామీ సమస్యలపై ఈ సభలో చర్చిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు కోలా రమణ, ఎ.సుజాతమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎ.రామాంజులు

మత్తు ముఠాల ఆటకట్టిస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి-పీలేరు

గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. గురువారం పీలేరు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం అర్ధరాత్రి పీలేరులో గంజాయి సేవించిన మత్తులో ఇద్దరు విద్యార్థులు నాగర్ కోయిల్ టు ముంబై వెళ్లే రైలు కిందపడి మృతి చెందిన ఘటనపై ఎస్‌పి స్పందించారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందుగా ఆయన పీలేరులో రైలు ఢీకుని మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి జరిగిన ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న అనుమానాలు ఉండే ప్రాంతాలు, మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపడుతూ, సమాచారం సేకరిస్తున్నామని, మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై స్థానికులు కూడా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా త్వరలో 'మా ఊరు మా పోలీస్' అన్న కార్యక్రమాన్ని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టి మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం వల్ల కలిగే అనర్థాలు, నష్టాల గరించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని, తమ పిల్లల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న విద్యాసాగర్‌నాయుడు

నీటి నాణ్యత పరీక్షలపై సిహెచ్‌ఒలకు శిక్షణ : డిఎంహెచ్‌ఒ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నీటి నాణ్యత పరీక్షలపై సిహెచ్‌ఒలకు శిక్షణ తరగతులు నిర్వహించామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని కొత్తపేట రామాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో డిపిఎంఒ డాక్టర్ రియాజ్ బేగ్ పర్యవేక్షణలో జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో పనిచేస్తున్న సమాజ ఆరోగ్య అధికారులు (సిహెచ్‌ఒ)లకు నీటి నాణ్యత పరీక్షలపై శిక్షణ అందించమని పేర్కొన్నారు. మదనపల్లె, రాయచోటి డివిజన్ పరిధిలోని సిహెచ్‌ఒలను ఒక బ్యాచ్ గాను, రాజంపేట, పీలేరు డివిజన్‌లోని సిహెచ్‌ఒలను మరొక బ్యాచ్‌గా విభజించి శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులలో తాగునీరు కలుషితమవుతున్నాయని దీనివల్ల టైఫాయిడ్, డయేరియా, డిసెంట్రీ, కామెర్లు వంటి జబ్బులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. నీటి నమూనాలు ఎక్కడ సేకరించాలి, ఎలా సేకరించాలి, పరీక్షల నిమిత్తం ఎలాంటి పరీక్ష నాలికలు ఉపయోగించాలి, ఏ రసాయనాలు ఎంత మోతాదులో కలపాలి, పరీక్ష అనంతరం ఫలితాన్ని ఎలా విశ్లేషణ చేయాలి, ఒకవేళ ఫలితాలలో నీటి నాణ్యత అసాధారణ స్థాయిలో ఉంటే ఏమి చేయాలి, ఫలితాలు యాప్‌లో ఎలా అప్లోడ్ చేయాలి అనే అంశాలపై సిద్ధాంతపరంగా విసదీకరణ చేస్తూ ప్రాక్టికల్ చేసి చూపించారు. శిక్షణ అనంతరం సిహెచ్‌ఒలు ప్రదో రోజు గ్రామీణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు చేసి ఫలితాలు యాప్‌లో అప్లోడ్ చేయాలని కోరారు. గతంలో వారానికి ఒకసారి మాత్రమే పరీక్షలు నిర్వహించేవారన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రతి రోజూ నీటి నాణ్యత పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ పరీక్షలు చేయడంతో ఎక్కడైనా నీరు కలుషితమవుతున్నాయని నిర్ధారణ ఐతే అక్కడ యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిఎంఒ వేణుగోపాల్, కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని సిహెచ్‌ఒలు పాల్గొన్నారు.

'లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి'


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాకు సంబంధించి స్వర్ణాంధ్ర-2047లోని లక్ష్యాలను సాధించేందుకు అధికారులందరూ కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, స్వర్ణాంధ్ర-2047పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరవు కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి, 686 మండలాల నుండి స్వర్ణాంధ్ర-2047పై విజన్ పత్రాలు అందాయని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. విజన్ పత్రాలను రూపొందించిన అనంతరం, జిల్లాలు, మండలాల పనితీరుపై సూచికలను ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో త్వరలో స్వర్ణాంధ్ర-2047కు సంబంధించిన పూర్తి నివేదికను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి, అన్నమయ్య జిల్లాకు సంబంధించి స్వర్ణాంధ్ర-2047 గురించి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, నైపుణ్య అభివృద్ధి, తదితర రంగాలలో మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో మన జిల్లాకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించుకున్నామని తెలిపారు. ఈ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పూర్తి స్థాయిలో సన్నద్ధం అవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణరావు, సిపిఒ వెంకటే, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


చెస్ టీమ్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

యూనివర్సిటీ చదరంగం జట్టుకు 'మిట్స్' విద్యార్థి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) చదువుతున్న ఎం.నాగేశ్వరి జెఎన్‌టియు యూనివర్శిటీ చెస్ టీంకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. బి.టెక్ రెండవ సంవత్సరం చదువుతున్న ఆమె అనంతపురం టీంకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఈ ఎంపికలు నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగాయన్నారు. ఈ సంవత్సరం డిసెంబర్ 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీ నిర్వహించబోతున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'శ్రీచైతన్య' విద్యార్థి..

రాజంపేట అర్బన్ : ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. ఈ నెల 21వ తేదీన కడపలో జరిగిన అండర్-17 చదరంగం పోటీలలో శ్రీ చైతన్యలో పదవ తరగతి చదువుతున్న మేరువ రుత్విక్ రామ్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గురువారం రుత్విక్ రామ్‌ను ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడా సాంస్కృతిక రంగాలలో కూడా తర్ఫీదునిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల మానసిక వికాసం మేధోసంపత్తికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక వ్వడం గర్వనీయమన్నారు. శ్రీ విద్యార్థి ఈ నెల 28, 29 తేదీలలో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీ లలో పాల్గొ నను న్నట్లు తెలియజేశారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకట సుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శాబు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం : సిఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోయిన ఎందరో పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు అన్నారు. పట్టణానికి చెందిన కానిస్టేబుల్ మునివెంకటప్ప గతంలో విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సిఐ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో మృతి చెందిన కానిస్టేబుల్ మునివెంకటప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాడసానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ, ప్రాణరక్షణగా నిలిచిన పోలీసుల త్యాగ్యాల్నీ మరువలేమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.


కానిస్టేబుల్ మునివెంకటప్ప కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిఐ

వసతి గృహాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ వసతి గృహాల పరిసరాల పరిశుభ్రతపై గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఆధ్వర్యంలో పీలేరు పంచాయతీ ఎగ్జికూటివ్ అధికారి గురుమోహన్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని కూడా కోరారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ పీలేరులోని ప్రభుత్వ వసతి గృహాల చుట్టు పక్కల ఉన్న అధ్వాన పరిస్థితులను ఇఒ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ వసతి గృహాల చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడం, నిలిచిన నీరు, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొందని చెప్పారు. వర్షాకాలంలో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, ఇతర వ్యాధులు అధికమవుతాయని ఇఒకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, అఖిల్, భరత్, చరణ్, విద్యార్థి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



లింగ వివక్షతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

లింగ వివక్షత చూపరాదు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

లింగ వివక్ష చూపవద్దని, ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాల్సి ఉందని వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ అత్తర్ ఫీమా అంజూమ్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష సహకారంతో గురువారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఒఎస్‌సి సిబ్బంది అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశులింగ నిష్పత్తిని పెంచడం, ఆడ పిల్లలను రక్షించి, చది వించాలన్నదే భేటీ బచావో భేటీ పడవో ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. మహిళా హత్యలు, బాల్య వివాహాలను అరికట్టడంలో అన్ని శాఖల వారు సమష్టిగా కృషి చేయాలని చెప్పారు. ఆడ పిల్లలు పుట్టడం అనేది అదృష్టంగా భావించాలని, మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను పెంచాలని సూచించారు. ఏ బిడ్డ పుడతాడో ముందుగానే తెలుసుకోవడానికి ప్రయత్నం చేయకూడదని తెలిపారు. మహిళలు వివక్షతకు గురైతే హెల్ప్ లైన్ నెంబర్ 181 కు ఫోన్ చేసి తక్షణ సాయం పొందవచ్చని అన్నారు. అనంతరం పట్టణ పరిశుభ్రత గురించి మున్సిపల్ కార్మికులతో చర్చించారు. పచ్చదనం పరిశుభ్రత వంటి విషయాల మీద అందరం దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ సిబ్బందిపారా లీగల్ చంద్రకళ, సుజాత నిరోషా మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం వెంటనే అమలు చేయాలి

- డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలో వచ్చి నాలుగు నెలలైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించలేదని అన్నమయ్య డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ విమర్శించారు. గురువారం రాయచోటి ఆర్‌టిసి బస్టాండ్ నుంచి వేంపల్లి, చిన్నమండెం, వెళ్లే పల్లెవెలుగు బస్సులో గాజులు భాస్కర్ పిసిసి జనరల్ సెక్రెటరీ అల్లాబకష్, పార్టీ మహిళ శ్రేణులతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన బస్సులో టిక్కెట్ కొని మహిళలకు బస్సు టికెట్ ఉచితం ఎప్పుడిస్తారు అంటూ ప్రభుత్వానికి సూటిగా ప్రశ్నించారు. ఉచిత ప్రయాణం అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు డిసిసి అధ్యక్షుడు పోస్ట్ కార్డు రాశారు. మహిళలు ఉచిత ప్రయాణం ఎప్పుడు అని అడుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో రోజూ 20 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారని, రోజు మహిళల ద్వారా రూ.7 కోట్ల ఆదాయం, నెలకు రూ.300 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ఉచిత ప్రయాణం కల్పిస్తే ఈ రూ.300 కోట్లు ఆర్‌టిసికి ఇవ్వాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వం భయపడుతుందన్నారు. ఎన్నికల ముందు మహిళలకు అమలు చేయలేని హామీ ఇచ్చి గంపగుత్తగా ఓట్లు వేయించుకొని అధికారంలో వచ్చాక కుటమి ప్రభుత్వం హామీలు మరిచారని ఆయన చెప్పారు. వెంటనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని, మహిళల కోసం పెట్టిన పథకాలు వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు. మాట తప్పిందని కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం అని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇటు తెలంగాణ, అటు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో డిసిసి చీఫ్ సెక్రెటరీ అమీర్, డిసిసి ఉపాధ్యక్షుడు దర్బార్, మైనారిటీ నాయకులు మన్సూర్‌అలీ ఖాన్, బావా సర్దార్, అమీర్ భాష, మహిళా నాయకులు రమణమ్మ నాగలత, నసీబ్ జాన్, రమీజా పాల్గొన్నారు.



ఆర్‌టిసి బస్టాండ్‌లో మహిళలతో పోస్టు కార్డులు రాయిస్తున్న నాయకులు

జిల్లా విద్యాశాఖ అధికారిగా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు నూతన డిఇఒలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారిగా కె.సుబ్రహ్మణ్యంను నియమిస్తూ గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా పని చేశారు. ఇక్కడ డిఇఒగా పనిచేస్తున్న వై.శివ ప్రకాష్‌రెడ్డి డిప్యూటీ డిఇఒగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.





గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న పశు వైద్యులు

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు : డిడి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని పశు యజమానులు తమ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాపించుకోవాలని పశుసంవర్ధకశాఖ డిడి డాక్టర్ మాలకొండయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నర్సుపల్లెలో 18 మంది సన్న జీవాల రైతులకు ఉచితంగా 2200 డోసులు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గురువారం నట్టల నివారణకు మందును స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో తాపించినట్లుపేర్కొన్నారు. గొర్రెల కాపర్లు గొర్రెల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి 31వరకు వరకు జీవాలకు పిల్లి సరక వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు. సన్న జీవాలకు చిటుకు వ్యాధి, ఒబ్బరోగము, నీలి నాలుక, పిపిఆర్ వ్యాధి, నిరోధక టీకాలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం21వ పశుగణన 25 నుంచి ఫిబ్రవరి 25 వరకు ప్రతి గ్రామంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది చేపడతారని తెలిపారు. రైతు సోదరులు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.శ్రీధర్ రెడ్డి డాక్టర్ ఎస్.రవికుమార్, స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ డి.గణేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని స్థానిక ప్రాథమిక వైద్యులు డాక్టర్ జియా ఉల్లా పేర్కొన్నారు. గురువారం మండలంలోని డి.రాచపల్లి పంచాయతీలో పెద్ద మాదిగపల్లె ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందించాలని తెలిపారు. అన్ని రకాల వైద్య సదుపాయాలు పిల్లలకి అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం విద్యార్థులకు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. అనీమియా గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల మైదానంలో గడ్డి ఎక్కువగా ఉండని దోమలు విజృంభించి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చెన్నక్రిష్ణ , ఉపాధ్యాయులు రెడ్డన్న, ఎఎన్ఎం చంద్రమ్మ, ఎ్డిసి కో-ఆర్డినేటర్ నాగయ్య, డిఇఒ మోహన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ జియాఉల్లా



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లయన్స్,వాకర్స్ క్లబ్ సభ్యులు

'ఈట్ దట్ ఫ్రాగ్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-నందలూరు

లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గ్రంథాలయంలో 'ఈట్ దట్ ఫ్రాగ్ ' పుస్తకం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా లయన్ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ ఒక రోజును పనుల పరంగా ప్రణాళిక బద్ధంగా ఎలా విభజించుకుని చేసుకుంటే సంపూర్ణమైన ఫలితం సాధించవచ్చు అన్న విషయాలు ఈ పుస్తకం చదవడం ద్వారా ఆచరించు కోవటానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం పుస్తకమును పాఠకులు చదువుకొనుట కొరకు గ్రంథాలయానికి అందించారు.కార్యక్రమంలో డాక్టర్ జయ భాస్కరరావు, లయన్ కుర్రా మణియాదవ్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ మోడపోతుల రాము, ఉప్పుశెట్టి సుధీర్, లయన్ కొత్తపల్లి రాజా చారి, గంధం గంగాధర్, గుండు సురేష్, వాకర్ గాడి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రియ

అనాథ పిల్లలను దత్తత తీసుకోండి

ప్రజాశక్తి-రామాపురం

తల్లిదండ్రుల కోల్పోయిన అనాథ పిల్లలను దత్తత తీసుకొని వారి కుటుంబ విలువలను తెలియజేయాలని జిల్లా శిశు గృహ మేనేజర్ సుప్రియ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం జిల్లా శిశు గృహ ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో అనాథ బబాల బాలిక సంరక్షణ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను ఎలా దత్త తీసుకోవాలి అనే పక్రియపై వివరించారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రేమానురాగాలు, కుటుంబ విలువలు తెలియ పరచడమే సమావేశం ముఖ్య ఉద్దేశమని అన్నారు. పిల్లల స్పాన్సర్‌షిప్ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. అనాథ పిల్లలను దత్తత తీసుకొని ఆశ్రమం కల్పించాలని అన్నారు. తల్లిదండ్రుల ప్రేమానురాగాలను పంచాలని అన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం దేవసేన, శిశు గృహ సోషల్ వర్కర్ గాయత్రి , వీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కౌన్సిలర్ వారి సిబ్బంది మండల సమైక్య సభ్యులు, విఒ సభ్యులు డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వన్ స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు ప్రభావతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలకు ప్రవేశపెట్టిన మిషన్ శక్తి స్కీమ్ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని పెద్దివీడు పంచాయతీలోని గ్రామాలలో అంగన్వాడీ ఆధ్వర్యంలో మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం శిశు సంక్షేమ శాఖ అను బంధంగా పనిచేస్తున్న వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హింసకు గురైన మహిళలు, లైంగిక వేధింపులు, గృహ హింస, బాల్యవివాహాలు, వివాహేతర సంబంధాలు, బెదిరింపులు వంటి సమస్యలు తో బాధపడుతూ ఉంటే వన్ స్టాప్ సెంటర్ లో తక్షణ సహాయ సహకారం అందిస్తుందని అన్నారు. సమస్యతో వచ్చిన మహిళలకు తాత్కాలిక వసతి అందించడంతోపాటు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి న్యాయ, వైద్య, పోలీస్ సహకారాలు ఉచితంగా అందిస్తామని అన్నారు. మహిళల కోసం వారంలో 24 గంటలు పనిచేసే హెల్ప్ లైన్ నెంబర్ 181 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తు తం బాలికలు మహిళల మీద జరుగుతున్న అన్యాయాలు అక్రమ వేధింపులు హత్యలు మానభంగాలు అరి కట్టడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, అంగన్వాడీ సూపర్‌వైజర్ సరస్వతీదేవి, అంగన్వాడీ కార్యకర్త జానకి, ఒఎస్‌సిసిబ్బంది హసీనా, రెడ్డి ప్రసన్న, మహిళలు పిల్లలు పాల్గొన్నారు.



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ప్రభావతి

మహిళలకు మగ్గం పరికరాలు పంపిణీ



మగ్గం పరికాలను అందిస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్ నందిని

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ కడప వారి సహకారంతో స్థానిక గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం పరికరాలను స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ నందిని, వెలుగు ఎపిఎం వసుంధర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను మహిళలు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాల న్నారు. స్వయం ఉపాధి యూనిట్ పెట్టుకొనుటకు నిజాయితీగా ముందుకు వచ్చేవారికి రుణాలు అందించేం దుకు కెనరాబ్యాంక్ ఎప్పటికీ ముందు ఉంటుందని అన్నారు. వెలుగు ఎపిఎం వసుంధర మాట్లాడుతూ ప్రతి శుభకార్యక్రమంలో మగ్గం వర్క్‌తో చేయించుకున్న జాకెట్స్ వేసుకోవడం పరిపాటి అయ్యిందన్నారు. మగ్గం వర్క్ డిజైన్స్ కుట్టే వారికి బాగా డిమాండ్ ఉందని ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. జ్యూట్ బ్యాగ్, కాలంకారీ బొమ్మలు మగ్గం వర్క్ వంటి వృత్తుల ద్వారా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను డిజైన్లను ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసుకొనుటకు అవకాశం ఉంద న్నారు. గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి మాట్లాడుతూ గతంలో కూడా ట్రస్ట్ తరపున మగ్గం వర్క్ శిక్షణ ఇచ్చామని వర్క్ ఆర్డర్లు కూడా ఇప్పించి మహిళలకు ఆదాయ అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో అతిథులను శాలువా మోమెంటోలతో సత్కరించారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం : సిఐ

ప్రజాశక్తి-కలకడ

సైబర్ నేరాలను అరికట్టడంలో యువత పాత్ర కీలకమైనదని సిఐ గురునాథ పేర్కొన్నారు గురువారం మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని వీటిని నివారించడంలో యువతులు ముందుండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలను నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ చొరవ తీసుకొని వాటి బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. అనంతరం సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్రను అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యాసర ఇచ్చిన పోటీలలో 22 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థులు రాసిన వ్యాసరించిన పోటీల జవాబు పత్రాలను స్థానిక పోలీసులు తీసుకెళ్లి జవాబులను పరిశీలించి గెలుపొందిన వారికి ఎస్‌పి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రామాం జనేయులు, కళాశాల ప్రిన్సిపల్ జయ భారతి, వైస్ ప్రిన్సిపల్ రమణయ్య , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ పుష్ప కుమారి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. **రాయచోటి :** విద్యార్థులు చిన్న నాటి నుంచే సైబర్ మోసాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సంబేపల్లి ఎస్ఐ భక్తవత్సలం పేర్కొ న్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మండల పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురు వారం సైబర్ నేరాల పై వ్యాసరచన పోటీలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాల ఆధా రంగా జరిగే మోసా లను సైబర్ నేరాలుగా చెప్పవచ్చు అన్నారు. సెల్ ఫోన్‌లకు వచ్చే మెసేజ్ ల పట్ల జాగ్ర త్తగా ఉండాలన్నారు. ఫోన్లో వచ్చే అనవసరమైన లింక్‌లను నొక్కరాదన్నారు. ఎటిఎంలను ఉపయో గించే టప్పుడు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య, కానిస్టేబుల్ శివయ్య, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



కలకడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రామాంజనేయులు

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



రామాపురం: రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ రామాంజులు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో ఇటీవల జరిగిన రీసర్వేతో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారాకే గ్రామ సభ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ రామాంజులు పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువులో గురువారం రీసర్వేలో ఏర్పడ్డ భూసమస్యల పరిష్కారానికి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గువ్వలచెరువు గ్రామంలో ఇటీవలి కాలంలో 857.13 ఎకరాలు రీ సర్వే చేసినట్లు తెలిపారు. రీసర్వే వల్ల గ్రామ ప్రజలకు ఎలాంటి భూ సమస్యలు ఉన్నా గ్రామసభ దృష్టికి తీసుకురావాలని సమస్య పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 9 మంది రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డిటి కృపావతి, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఒ, స్థానిక నాయకులు హరి ప్రసాద్, శివయ్య పాల్గొన్నారు. **నిమ్మనపల్లె:** రీసర్వే భూములపై నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తహశీల్దార్ ధనుంజయులు అన్నారు. మండలంలోని టి.చౌకిళ్ళవారిపల్లె గ్రామంలో రెవెన్యూ అధికారి రాంప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక విఆర్ఒలు సచివాలయ సర్వేయర్లతో కలిసి రీసర్వే భూముల సమస్యల పరిష్కారానికై గ్రామ సభను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి పట్టాదారు పాసు పుస్తకంలో వివరాలను సరి చేయడానికి, భూముల విస్తీర్ణంలోని వ్యత్యాసాలను సరిచేయడానికి, హక్కుదారులకు భూమి బధలాయింపు వంటి సమస్యలపై అర్జీలు రావడం జరిగిందన్నారు. రైతులు తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి రైతు తమకున్న సమ స్యలను సరైన ధ్రువపత్రాలను జోడించి అర్జీ రూపంలో గ్రామ సభలో తెలపాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ప్రజాశక్తి-నందలూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా ఎస్‌జిఎఫ్ అండర్-14, అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలకు నంద లూరు హైస్కూల్ విద్యార్థులు తేజ కృష్ణ,పెంచలయ్య, నరసింహ,స్వర్ణలత, వెంకటస్నేహ, మల్లికార్జున, మాలశ్రీ రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎన్.శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల బయనపల్లి, చింత కొమ్మదిన్నెలో జరిగిన అండర్-14 ఖోఖో పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన 7 వ తరగతి విద్యార్థి నాగచైతన్య కూడా రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం హర్షణీయని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉత్తమ పౌరులుగా తయారు కావాలని కోరారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థు లను అసిస్టెంట్ హెడ్ మాస్టర్ షేక్ రౌఫ్‌బాషా, పీడీ ఎస్.క్రిష్ణయ్య, ఉపాధ్యాయులు అభినం దించారు.

రూ.పది నాణేలు చట్టబద్ధమైనవే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పది రూపాయల నాణేలు చట్టబద్ధమైనవేనని ప్రతి ఒక్కరూ పది రూపాయల నాణేలను లావాదేవీలలో ఉపయోగించాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరినాథ్ గుప్తా తెలిపారు. గురువారం పది నాణెల చలామణిపై ఆయన అవగాహన కల్పించారు. జనసంచార కూడలిలో షాపుల వద్ద పది రూపాయల నాణెల చలామణిపై ముద్రించిన స్టిక్కర్లను అంటించారు. రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు పది రూపాయల నాణెల చెల్లుబాటు అవుతుందని తెలిపారు. దీనిపై ఎలాంటి ఆపోహలు పడాల్సిన అవసరం లేదని తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్రామయ్య

సకాలంలో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలతో పాటు సకాలంలో వైద్య సేవలు అందించాలని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ వెంకటరామయ్య స్టాఫ్‌నర్సు, ఎఎన్ఎంలకు సూచించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో తంబళ్లపల్లి, బి.కొత్తకోట ఆస్పత్రులలో విధులు నిర్వహిస్తున్న నర్సులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేర్ క్యాంపెయిన్ ప్రోగ్రాం ట్రైనర్ డాక్టర్ సంధ్య, మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి సుఖ ప్రసవం జరిగే వరకు తీసుకోవాల్సిన ఆరోగ్య సూచనలు,సలహాలు అందించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఆరోగ్యం పట్ల చైతన్యం కల్పించిన ప్పుడే వారు సకాలంలో అన్ని రకాల పరీక్షలతో పాటు వైద్య సేవలు పొంది ప్రభుత్వ ఆసుపత్రులలోనే సుఖ ప్రసవం కాగలరని అన్నారు. ఆస్పత్రి వచ్చే రోగుల దురుసుగా ప్రవర్తించకూడదని తెలిపారు. వారు అడిగే వివరాలకు విసుగు చెందకుండా వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. విధి నిర్వ హణలో ఎవరు నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-కలికిరి : స్థానిక పట్టణంలో అయ్యప్ప మాలధారులకు ముస్లిం మైనార్టీలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం గొప్పదని ప్రతి యేటా నవంబర్ మాసంలో అయ్యప్ప మాలధారులకు భోజన వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జమయిత్ ఉలుమా-ఏ-హింద్ సెక్రటరీ ముస్తఫా హాజరత్, ఖాదర్‌వల్లి, టివిషాప్ బాషా ఇస్మాయిల్, గురుస్వామి, మని, రాజా పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రుబీనా హాజీరా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రామాపురం

మారుమూల గ్రామాలలో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని కింగ్ ఆస్పత్రి వైద్యులు రుబీనా హాజిరా పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట మసీదు సందులో గురువారం ఉచిత వైద్య శిబిరానికి ప్రారంభించారు. సుమారు 200 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నీలకంఠరావుపేటలో మైనారిటీ పేదలు ఎక్కువగా ఉన్నారని వారి ఆరోగ్య కోసం తమ ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి ఇక్కడ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంలో ఆయుబ్‌ఖాన్ చేసిన కృషి అభినందనీయమని అన్నారు. ఆయుబ్ ఖాన్ మాట్లాడుతూ అడిగిన వెంటనే మారుమూల గ్రామంలో వైద్యం ఏర్పాటుకు సహరించిన కింగ్ ఆస్పత్రి యాజ మాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డాక్టర్ రుబీనా డాక్టర్ హాజీరాకు గ్రామ సర్పంచ్ అంజుమ్ సుల్తానా, స్కూల్ కమిటీ చైర్మన్ సయ్యద్ పీర్‌లతో కలిసి శాలువా కప్పి సత్కరిం చారు. కార్యక్రమంలో ఎఎన్ఎం శశికళ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల వద్ద తాగునీటి కోసం నిరీక్షిస్తున్న మహిళలు

చిన్నంపల్లి దళితవాడలో నీటి కష్టాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్నంపల్లి దళితవాడలో తాగునీటి కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం పడరాని కష్టాలు పడుతున్నామని తమ గోడు వెళ్ళబోసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల మోటారు దగ్గర నుంచి నీరు పట్టుకొని గ్రామస్తులు, ముసలి వాళ్ళ గ్రామంలోకి తీసుకెళుతున్నామని చెప్పారు. దళిత గ్రామాలంటే ప్రభుత్వ అధికారులకు, రాజకీయ నాయకులకు చులకన అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యు ఎస్ అధికారులు కనీసం నెలలో ఒక్కసారైనా మారుమూల దళిత గ్రామాలు పర్యటించి తమ కష్టాలను చూడాలని అన్నారు. నీటి సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని వివరణ కోరగా తాగునీటి మోటర్ గత రెండు రోజుల క్రితం మరమ్మతులకు వచ్చిందని శుక్రవారం మోటార్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని చాకీబండ గ్రామం దళితవాడకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు మావులూరి డిమాండ్ చేశారు. గురువారం దళితవాడ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా తాగునీటి సమస్య తొ చాల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బోరు వేయించాలని ఆయన కోరారు.

నేరాలు అదుపు చేసేందుకు కృషి చేయాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో నేరాలను పూర్తిగా అదుపు చేసేందుకు కృషి చేయాలని మదనపల్లి డిఎస్‌పి కొండయ్యనాయుడు ఎస్ఐ లోకేష్‌రెడ్డిని ఆదేశించారు. గురువారం తంబళ్లపల్లి పోలీసుస్టేషన్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఫిర్యాదులు, నమోదైన కేసులు, పోలీసుల పనితీరు, తదితర అంశాలపై ఎస్ఐ ని అడిగి తెలుసుకున్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. పోలీసులు ప్రజలతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. అనంతరం గతంలో విధి నిర్వహణలో ఉంటూ మృతిచెందిన ఎస్ఐ రెడ్డప్ప నాయక్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మొలకలచెరువు సిఐ రాజారమేష్ ఉన్నారు.



పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి కొండయ్యనాయుడు

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్నకారు : వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కలికిరి

బైక్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అద్దావారిపల్లి గ్రామం, మస్తాన్‌వల్లి దర్గా సమీపంలో కలికిరి-కలకడ ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి కలికిరి నుంచి కలకడ వైపు వెళుతున్న కారు బైక్ పై వెళుతున్న చిత్తూరు జిల్లా సోమలమండలం, టి.చెరుకూరివారపల్లికి చెందిన కోటగుండ్ల కృష్ణయ్యను ఢీకొ ట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఒక భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని అన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జె.రఫీ తెలిపారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఈఘటనపై పూర్తిస్థాయి విచారణ చేస్తామని సిఐ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

శ్మశాన వాటిక దురాక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రామసముద్రం

శ్మశాన వాటిక దురాక్రమణపై యం.గొల్లపల్లి హరిజనవా కాలనీ వాసులు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ లెక్కల ప్రకారం సర్వే నెంబర్ 259లో వారి తాతల ముత్తాతలు కాలం నుంచి యం.గొల్లపల్లి హరిజనవాడ కాలనీలో ఎవరూ మరణించిన ప్రభుత్వం శ్మశాన వాటికకు కేటాయించిన స్థలంలోనే దహన క్రియలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మధ్య కాలంలో తమ గ్రామానికి చెందిన కొందరు ఆక్రమణదారులు స్మశానాన్ని సమాదులను కూడా దున్నేసి సాగు చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై తమ న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుపై స్పందించిన ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఈవిషయంపై తహశీల్దార్‌తో చర్చించి రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది కలసి స్మశాన వాటిక సర్వే చేయించి శ్మశాన వాటిక ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.